
సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం : 27 : జూన్ : 2025



కర్తవ్య నిర్వహణలో విగతజీవులై..

కర్తవ్య నిర్వహణలో ఉన్న పోలీసు సిబ్బంది రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందడం ఆ కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. 8లో ▸



చేదు మిగిల్చిన మామిడి

ఈ ఏడాది మామిడి దిగుబడి తక్కువగా ఉండటం, ధర లేకపోవడంతో రైతులు ఆదాయం లేక నిరాశలో కొట్టుమిట్టాడుతున్నారు. 8లో ▸



సర్కారు నిర్ణయం.. డీలర్లకు భారం

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దనే రేషన్ నరుకులు అందించాలని కూటమి సర్కారు ఆదేశించడం రేషన్ డీలర్లకు భారంగా మారింది. 8లో ▸

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శిగా పాలడుగు



పి.సత్యనారాయణ

పెదవేగి: వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శిగా పెదవేగి మండలం కొండల రావుపాలెం గ్రామానికి చెందిన పాలడుగు సత్యనారాయణ (పెద బాబు) నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

ఉపాధ్యాయుల కొరత

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కుక్కునూరు మండలంలోని సర్కారీ బడుల్లో టీచర్ల కొరత ఉందని, వెంటనే సమస్య పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కొలికపోగు లెనిన్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బడుల పునః ప్రారంభంలోనే పలువురు టీచర్లు బదిలీ కాగా.. ఖాళీ పోస్టుల భర్తీలో విద్యాశాఖ అలసత్వం వహిస్తోందన్నారు. కుక్కునూరు మండలంలోని 41 పాఠశాలల్లో 114 మంది ఉపాధ్యాయ పోస్టులు ఉండగా రెగ్యులర్ టీచర్లు 20 మంది డిప్యూటేషన్‌పై మరో 18 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారన్నారు. దీంతో విద్యార్థుల చదువులు అగమ్యగోచరంగా మారాయన్నారు. మండలంలోని రాయిగూడెం, ఉప్పేరు, చీరవల్లి, రామసింగారం సెంటర్లలోని 4 మోడల్ పాఠశాలల్లో 26 మంది టీచర్లకు 8 మంది మాత్రమే పనిచేస్తున్నారని, ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు.

డీఎస్సీ పరీక్షలకు 549 మంది హాజరు



ఏలూరు (ఆర్‌ఆర్ పేట): ఏలూరులో గురువారం జరిగిన డీఎస్సీ పరీక్షలకు 549 మంది అభ్యర్థులు హాజరయ్యారు. సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో ఉదయం 100 మందికి 93 మంది, మధ్యాహ్నం 100 మందికి 90 మంది హాజరయ్యారు. సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 200 మందికి 184 మంది, మధ్యాహ్నం 207 మందికి 182 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖా ధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ తెలిపారు.

'పశ్చిమ'లో 87.88 శాతం హాజరు

భీమవరం: జిల్లాలోని ఐదు కేంద్రాల్లో గురువారం నిర్వహించిన మెగా డీఎస్సీ పరీక్షలకు 87.88 శాతం అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఈ.నారాయణ చెప్పారు. సెషన్-1లో 560 మందికి 502 మంది, సెషన్-2లో 133 మందికి 107 మంది అభ్యర్థులు హాజరయ్యారని, ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని నారాయణ తెలిపారు.

డ్వాక్రా అవకతవకలపై చర్యలు

ఏలూరు(మెట్రో): డ్వాక్రా గ్రూపుల్లో అవకతవకలపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. గురువారం స్థానిక జెడ్పీ కార్యాలయంలో నిర్వహించిన స్థాయి సంఘ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీఆర్‌డీఏ, గృహ నిర్మాణం తదితర సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై సమీక్షించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యే బడేటి చంటి, జెడ్పీ సీఈఓ ఎం.శ్రీహరి, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

అగ్రగామిగా నిలపాలి

ఉభయ జిల్లాల అధికారులు కలిసికట్టుగా పని చేసి జిల్లాను అగ్రగామిగా నిలపాలని జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ అన్నారు. జెడ్పీ చైర్మన్ చాంబర్‌లో గురువారం ఆమె స్థాయి సంఘ సమావేశం నిర్వహించారు.

తణుకు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా సాయికిరణ్



డాక్టర్ కాకర్లమూడి సాయి కిరణ్

తణుకు అర్బన్: తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ కాకర్లమూడి సాయికిరణ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సూపరింటెండెంట్‌గా ఉన్న వెలగల అరుణ ఇటీవల తాడేపల్లిగూడెం బదిలీ అయ్యారు. కొవ్వూరు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్‌గా ఉన్న ఆర్థోపెడిక్ డాక్టర్ సాయికిరణ్‌ను ఇక్కడ నియమించారు. సివిల్ సర్జన్‌గా డాక్టర్ ఏవీఆర్ఎస్ తాతారావు ఆస్పత్రి ఆర్‌ఎంఓగా బాధ్యతలు స్వీకరించగా, జనరల్ మెడిసిన్‌గా డాక్టర్ పీఎల్‌వీ సుబ్బారావు, గైనిక్ విభాగంలో డాక్టర్ జె.లెటోర్నా దేవి, డిప్యూటీ సివిల్ సర్జన్ స్పెషలిస్ట్‌గా, పాథాలజీ వైద్యురాలిగా డాక్టర్ ఎస్.కనకదుర్గ, ఎంబీబీఎస్ డాక్టర్ సుధారాణి బదిలీల్లో ఇక్కడ ఆస్పత్రికి వచ్చారు. బదిలీలకు ముందుగా గైనిక్ విభాగంలో డాక్టర్ కె.గాయత్రి సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్‌గా విధుల్లోకి వచ్చారు.

పుట్టగొడుగుల్లా.. పుట్టుకొస్తున్నాయ్

యథేచ్ఛగా అనధికార లేఅవుట్లు

- నిబంధనలు పాటించని రియల్టర్లు
- పట్టణ, మండల కేంద్రాల సమీప గ్రామాలే టార్గెట్
- ఎలాంటి అనుమతులూ లేకుండా వెంచర్లు
- కూటమి నేతలు, పంచాయతీ అధికారులకు మామూళ్లు
- జిల్లాలో 1,750 వరకు అనధికార లేఅవుట్లు



అక్రమ లేఅవుట్లు.. నిబంధనలకు తూట్లు.. నరసాపురం మండలంలో అనధికార లేఅవుట్



వీరవాసరం మండలంలో అనధికార లేఅవుట్



పెనుగొండ మండలంలో అనధికార లేఅవుట్‌లో హెచ్చరిక బోర్డు

సాక్షి, భీమవరం: ప్రభుత్వ ఖజానాకు గండికొడుతూ జిల్లాలో అనధికార లేఅవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. కూటమి నేతల అండదండలతో కొందరు రియల్టర్లు యుడా నిబంధనలు తుంగలోకి తొక్కి అడ్డగోలుగా లేఅవుట్లు వేసి ప్లాట్లు విక్రయిస్తున్నారు. అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తుండటంతో పట్టణ, మండల కేంద్రాల సమీప గ్రామాలు లక్ష్యంగా అనధికార వెంచర్లు యథేచ్ఛగా వెలుస్తున్నాయి.

లేఅవుట్లుగా పొలాలు

విద్య, ఉద్యోగం, వ్యాపారం నిమిత్తం పట్టణాల వైపు చూస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. పల్లెల నుంచి వలస వచ్చిన కుటుంబాలు స్థానికంగా స్థిర నివాసం ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. తమకు అందుబాటు ధరలో స్థలం కొనుగోలు చేసి ఇంటిని నిర్మించుకోవాలని చూస్తున్నారు. పట్టణాలతో పోలిస్తే సమీప గ్రామాల్లో భూముల ధరలు తక్కువగా ఉండటంతో ఆయా ప్రాంతాల్లో భూముల కొనుగోలుకు ప్రాధాన్యమిస్తున్నారు. డిమాండ్ బాగుండటంతో పట్టణ, మండల కేంద్రాలకు సమీప గ్రామాల్లోని పంట పొలాలను రియల్టర్లు లేఅవుట్లుగా మార్చేస్తున్నారు.

ఖజానాకు గండి

జిల్లాలోని పంచాయతీల పరిధిలో లే అవుట్ వేసేందుకు ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (యుడా) అనుమతి తీసుకోవాలి. నిబంధనలు మేరకు లేఅవుట్ విస్తీర్ణంలో 10 శాతం కామన్ సైట్‌ను పంచాయతీ పేరిట రిజిస్ట్రేషన్ చేయించాలి. 40 అడుగుల రోడ్లు వేసి డ్రెయిన్లు, విద్యుత్, తాగు నీటి వసతి కల్పించడంతో పాటు నిర్ణీత ఫీజు చెల్లించి ప్రభుత్వం నుంచి అప్రూవల్ పొందాల్సి ఉంటుంది. నిబంధనల మేరకు లేఅవుట్లు ఏర్పాటు చేస్తే ప్లాటు ధర పెరిగిపోవడంతో పాటు కామన్ సైట్ రూపంలో కొంత భూమిని కోల్పోవాల్సి వస్తుందన్న ఉద్దేశంతో చాలామంది రియల్టర్లు ఎలాంటి అనుమతులు లేకుండా, వసతుల కల్పన చేయకుండా కేవలం 20 అడుగుల వెడల్పున రోడ్లతో ప్లాట్లు విడదీసి విక్రయాలు చేసేస్తున్నారు. ఫీజుల రూపంలో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు. కాగా అనధికార లేఅవుట్లలో పంచాయతీలు రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్ తదితర వసతులు కల్పించవు. ఈ ప్లాట్లలో భవన నిర్మాణానికి ప్లాన్ పొందాలంటే క్రమబద్ధీకరించుకోవాల్సి ఉంటుంది. తక్కువ ధరకు వస్తున్నాయన్న ఉద్దేశంతో అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ప్రజలు మోసపోతున్నారు. అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు వలన ఇబ్బందులు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.

4 వేల ఎకరాల వరకు..

జిల్లావ్యాప్తంగా అనధికార లేఅవుట్లు సుమారు 1,750 వరకు ఉండగా వీటి విస్తీర్ణం దాదాపు 4 వేల ఎకరాల వరకు ఉంటుందని అంచనా. భీమవరం డివిజన్‌లో 1,050 వరకు ఉండగా, నరసాపురం డివిజన్‌లో 700 వరకు ఉన్నాయి. అత్యధికంగా తాడేపల్లిగూడెం, పాలకోడేరు, కాళ్ల, భీమవరం, పాలకొల్లు, నరసాపురం, పెనుమంట్ర, పెంటపాడు మండలాల్లో అనధికార లేఅవుట్లు ఉన్నాయి. కొన్నిచోట్ల ప్రజలకు తెలిసేలా పంచాయతీ అధికారులు అనధికార లేఅవుట్లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తుండగా, చాలాచోట్ల రియల్టర్లతో కుమ్మక్కై యజమానులకు కనీసం నోటీసులు కూడా ఇవ్వడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అనధికార లేఅవుట్లు ఏర్పాటుకు ముందే రియల్టర్లు కూటమి ప్రజాప్రతినిధులు, నేతలను కలిసి భారీ మొత్తంలో ముడుపులు ముట్టజెబుతున్నట్టు సమాచారం.

వసతులు మృగ్యం

అనధికార లేఅవుట్లలో రోడ్లు, మంచినీరు, విద్యుత్ తదితర వసతులను స్థానిక సంస్థలు కల్పించవని పంచాయతీ అధికారులు చెబుతున్నారు. ప్లాట్లు కొనేటప్పుడు సదరు లేఅవుట్‌కు అనుమతి ఉందో లేదో పంచాయతీలో సంప్రదించి తెలుసుకోవాలని సూచిస్తున్నారు. అనధికార లేఅవుట్లపై చర్యలు తీసుకుంటున్నామని పంచాయతీరాజ్‌శాఖ అధికారి ఒకరు తెలిపారు.

నరసాపురం ఆస్పత్రిలో ఇద్దరు ఉద్యోగులపై చర్యలు

భీమవరం (ప్రకాశంచౌక్): నరసాపురం ఏరియా ఆస్పత్రిలోని పోస్టుమార్టం విభాగంలో ఇద్దరు ఉద్యోగులపై వేటు పడింది. ఏప్రిల్ 16న మొగల్తూరు ప్రాంతంలో ఉపాధి కూలీల మీదకు వ్యాన్ దూసుకువెళ్లిన ప్రమాదంలో జి.గంగాభవాని (50), కె.పావని (47) మృతిచెందారు. మృతదేహాలను నరసాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఆ సమయంలో పోస్టుమార్టం చేయడానికి సిబ్బంది రూ.3 వేలు సొమ్ము తీసుకున్నారని మృతుల బంధువులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ విచారణకు ఆదేశించారు. విచారణలో అవినీతి ఆరోపణలు రుజువు కావడంతో పోస్టుమార్టం అసిస్టెంట్ డి.వెంకటేశ్వరరావు (అవుట్ సోర్సింగ్ ఉద్యోగి)ని ఉద్యోగం నుంచి తొలగించారు. అలాగే జనరల్ డ్యూటీ అటెండర్‌గా పనిచేస్తున్న కె.ఉదయ బాబును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఉత్తర్వులు జారీ చేశారు.

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి



భీమవరంలో ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

భీమవరం: డ్రగ్స్ యువత భవిష్యత్తును నాశనం చేయడంతో పాటు నేరాలు పెరగడానికి కూడా కారణమవుతున్నాయని కలెక్టర్ సీహెచ్ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా భీమవరంలో గురువారం అంబేడ్కర్ సెంటర్ నుంచి అల్లూరి సీతారామరాజు స్మృతి వనం వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ గంజాయి రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయులు సైతం యువత డ్రగ్స్ ఉచ్చులో పడకుండా ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ప్రజలకు డ్రగ్స్ గురించి సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, పలువురు ప్రముఖులు, పోలీసు అధికారులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు మద్దతు తెలిపారు. జిల్లా అదనపు ఎస్పీ వి.భీమారావు, భీమవరం డీఎస్పీ ఆర్.జయ సూర్య తదితరులు పాల్గొన్నారు.

● క్షేత్ర రహదారి.. అధ్వానంగా మారి..



పంగిడిగూడెం వద్ద ప్రయాణికుల జాగ్రత్త కోసం స్థానికులు ఏర్పాటుచేసిన చెట్టు కొమ్మ



ద్వారకాతిరుమలలోని మార్కెట్ యార్డు వద్ద..

భీమడోలు-ద్వారకాతిరుమల క్షేత్ర ప్రధాన రహదారికి తూట్లు పడ్డాయి. దీంతో స్వామి దర్శనానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిళ్లు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రధానంగా ద్వారకాతిరుమలలోని నిమ్మకాయల మార్కెట్ యార్డు వద్ద, క్షేత్ర దేవత కుంకుళ్లమ్మ ఆలయ సమీపంలోని మలుపులో, సూర్యచంద్రరావుపేట చెరువు వద్ద, గొల్లగూడెం సెంటర్‌లో, పంగిడిగూడెం వద్ద రోడ్డు ధ్వంసమైంది. వర్షం నీటితో నిండి భారీ గుంతలు భయపెడుతున్నాయి. అయినా పాలకులు, అధికారులకు ఏ మాత్రం పట్టడం లేదు.

– ద్వారకాతిరుమల



సూర్యచంద్రరావుపేట వద్ద..



కుంకుళ్లమ్మ ఆలయ సమీపంలో..

నిర్వాసితులపై నిర్లక్ష్యం

గోడు పట్టని సర్కారు

- సమస్యల పరిష్కారానికి ఎదురుచూపులు
- ఏడాదిగా పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్న పోలవరం నిర్వాసితులు
- మద్దతుగా నిలుస్తున్న ప్రజాసంఘాలు



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పోలవరం నిర్వాసితులు (ఫైల్)

ఏలూరు (టూటౌన్): పోలవరం ప్రాజెక్టు వల్ల సర్వం కోల్పోయిన తమను ఆదుకోవాలని, దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ప్రాజెక్టు నిర్వాసితులు ఆందోళనలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడిచినా వీరి ఆందోళనలు పట్టించుకోవడం లేదు. నిర్వాసితుల సమస్యల పరిష్కరించాలని, అల్లూరి సీతారామరాజు జిల్లా కొండ మొదలు పంచాయతీ పెద్దలతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని తక్షణమే అమలు చేయాలని కోరుతూ నిర్వాసితులు పోరాటం చేస్తున్నారు. వీరి పోరాటానికి ఏజెన్సీ గిరిజన సంఘం, రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) కమిటీలతో పాటు పలు వామపక్ష పార్టీలు మద్దతు ఇస్తున్నాయి. దీనిలో భాగంగా ఇటీవల ఏలూరు కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. స్థానిక జ్యూట్ మిల్లు సెంటర్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నుంచి కలెక్టరేట్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు.

21 ఏళ్లుగా ఎదురుచూపులు : పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభమై 21 ఏళ్లు కావస్తున్నా ఇప్పటి వరకూ నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కాలేదు. అత్యధికంగా ముంపునకు గురవుతున్న ఆదివాసీలకు భూమికి భూమి, ఆర్‌అండ్‌ఆర్ ఇవ్వకపోవడంతో వీరి జీవితాలు దుర్భరంగా మారాయి. ఓ పక్క ప్రాజెక్టు పనులు సాగుతున్నా.. నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కూటమి సర్కారు చొరవ చూపకపోవడం విమర్శలకు తావిస్తోంది. పోలవరం మండలం తెల్లవరం గ్రామస్తులకు పునరావాసం కల్పించాలని, భూమికి భూమి ఇవ్వలేదని, ఉపాధి హామీల్లో నమోదు చేయాలని, పాత గ్రామాలకు వెళ్లి వ్యవసాయం చేద్దామంటే అటవీ శాఖ అధికారులు వేధిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తూటిగుంట, కొండ్రుకోట, సింగనపల్లి రెవెన్యూ గ్రామాల్లో ఏజెన్సీ గిరిజన సంఘం ఉమ్మడి సాగును ప్రభుత్వం న మోదు చేసిన ప్రకారంగా ఆ భూములకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

నిర్వాసితుల ప్రధాన డిమాండ్లు

- పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులందరికీ భూమి, అడవి, సంపూర్ణమైన పునరావాసం కల్పించాలి.
- 2013 భూసేకరణ చట్టం ప్రకారం నిర్వాసితుల సమస్యలన్నింటినీ పరిష్కరించాలి.
- అల్లూరి సీతారామరాజు జిల్లా కొండమొదలు పెద్దలతో 2017లో ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాన్ని అమలు చేయాలి.
- పోలవరం మండలం తెల్లవరం నిర్వాసితులు వింజరం గ్రామం వద్ద పాకలు నిర్మించుకుని జీవిస్తున్నారు. వీరిపై అటవీ శాఖ అధికారులు వేధింపులు ఆపాలి.
- పోలవరం మండలం తూటిగుంట, కొండ్రుకోట, సింగనపల్లి రెవెన్యూ గ్రామాల్లో సభ్యులకు సాగు నమోదు చేసిన ప్రకారం ఆర్‌అండ్‌ఆర్‌లో భాగంగా చెట్లకు పరిహారం, భూమికి భూమి హక్కులు కల్పించాలి.
- గ్రామాలు ఖాళీ చేసే నాటికి 18 ఏళ్లు నిండిన వారందరికీ ఆర్‌అండ్‌ఆర్ ఇవ్వాలి.
- విలీన మండలాలతో సహా నిర్వాసితులందరికీ పూర్తి పునరావాసం కల్పించాలి.
- డీ పట్టా భూములు సాగు చేస్తున్న ఆదివాసులకు పూర్తి పరిహారం ఇవ్వాలి.
- నేషనల్ పార్కు పేరుతో ఆదివాసీలను ఖాళీ చేయించరాదు.
- నిర్వాసితుల అనుభవంలో ఉన్న కొండ పోరంబోకు, వీఎస్ఎస్‌లకు నష్టపరిహారాలు అందించాలి.
- పోలవరం మండలం ఎల్ఎన్‌డీ పేట, నాగంపాలెం, ప్రగడపల్లి, వింజరం, ఇటుకలకోట రెవెన్యూలో 30 ఏళ్లుగా గిరిజనుల సాగులో ఉన్న భూములకు హక్కులు కల్పించాలి.

వేధింపులు ఆపాలి



పోలవరం మండలం తెల్లవరం గ్రామానికి చెందిన నిర్వాసితు లమైన మేం వింజరం గ్రామం వద్ద పాకలు నిర్మించుకుని జీవిస్తున్నాం. గ్రామంలోకి వెళ్లి వ్యవసాయం చేస్తుంటే మాపై అటవీ శాఖ అధికారులు చేస్తున్న వేధింపులను తక్షణం నిలుపుదల చేయాలి. మాకు ఉపాధి హామీ పనులు కల్పించాలి.

– కుంజం రామారావు, నిర్వాసితుడు, తెల్లవరం, పోలవరం మండలం

భూమి హక్కులు కల్పించాలి



పోలవరం మండలం తూటిగుంట, కొండ్రుకోట, సింగనపల్లి తదితర రెవెన్యూ గ్రామాల్లో ఏజెన్సీ గిరిజన సంఘం ఉమ్మడిగా సంఘ సభ్యుల సాగును నమోదు చేసింది. దాని ప్రకారం ఆర్‌అండ్‌ఆర్‌లో పరిహారం, భూమికి భూమి హక్కులు కల్పించాలి. డీ ఫాం పట్టా భూములకు పరిహారం చెల్లించాలి.

– మిడియం పోసిరావు, నిర్వాసితుడు, చేగొండపల్లి, పోలవరం మండలం

ఉపాధి పనులు లేవు



పోలవరం ప్రాజెక్టు వల్ల సర్వం కోల్పోయి వేరే ప్రాంతంలో తలదాచుకుంటున్న మాకు కనీసం ఉపాధి హామీ పనులు కల్పించకపోవడం దారుణం. తక్షణం జిల్లా అధికారులు జోక్యం చేసుకుని నిర్వాసితులకు పనులు కల్పించాలి. 18 ఏళ్లు నిండిన వారందరికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇప్పించాలి.

– మాదే పోశమ్మ, నిర్వాసితురాలు, తెల్లవరం, పోలవరం మండం

క్లుప్తంగా

ఏఐపై మరిన్ని పరిశోధనలు జరగాలి



పరస్పర ఒప్పందాలు కుదుర్చుకున్న విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విశ్వ విద్యాలయ పరిధిలోని పరిశోధన, బోధన, విస్తరణ రంగాల పురోగతిని బలోపేతం చేసేందుకు డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయం, యూఎస్ఏ కాన్సాస్ స్టేట్ యూనివర్సిటీలు పరస్పర ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. విశ్వ విద్యాలయం ఉప కులపతి డాక్టర్ కే.గోపాల్, డాక్టర్ పీవీ వర ప్రసాద్, యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆర్‌ఓ క్రస్, ఎండోడ్ ప్రొఫెసర్, డైరక్టర్ సెంటర్ ఫర్ క్రాప్స్, క్లైమేట్ అండ్ కమ్యూనిటీస్, కాలేజీ ఆఫ్ అగ్రికల్చర్, యూఎస్ఏ కాన్సాస్ స్టేట్ యూనివర్సిటీ సభ్యులు గురువారం ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. గోపాల్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ, మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ వంటి ఉద్యాన సంబంధిత పరిశోధనలు మరిన్ని జరగాలన్నారు. డాక్టర్ వర ప్రసాద్ మాట్లాడుతూ విశ్వ విద్యాలయంలోని ఫ్యాకల్టీ, విద్యార్థులకు ఉపయోగపడేలా అనుబంధ పరిశోధన, అధ్యాపక అవకాశాలు కల్పిస్తారన్నారు. డాక్టర్ కే.ధనుంజయ్ రావు, అధికారులు ఎం.మాధవి, బి.శ్రీనివాసులు, ప్రసన్నకుమార్, ఎస్‌శ్రీ విజయపద్మ, జి.రామానందం అసోసియేషన్ డీన్‌లు, విద్యార్థినీ, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

వివాహితపై హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జయసూర్య

భీమవరం (ప్రకాశం చౌక్): బ్లేడుతో వివాహితపై హత్యాయత్నం జరిపిన కేసులో నిందితుడిని పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. భీమవరం డీఎస్పీ జయసూర్య స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. తనను వివాహం చేసుకోవాలని పట్టణానికి చెందిన పాలిశెట్టి హేమంత్ వివాహిత మామిడి నాగసూర్యమణిపై ఒత్తిడి చేశాడు. ఆమె నిరాకరించడంతో బుధవారం హేమంత్ బ్లేడుతో నాగమణిపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఎస్పీ, డీఎస్పీ పర్యవేక్షణలో వన్‌టౌన్ సీఐ ఆధ్వర్యంలో నాలుగు టీమ్‌లు ఏర్పాటు చేసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడు హేమంత్ భీమవరం బైపాస్ రోడ్డులో ఉన్నట్లు గుర్తించి గురువారం ఉదయం 11 గంటలకు అతడిని అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. విచారణలో నాగమణి పెళ్లికి తిరస్కరించడంతో కోపంతోనే ఆమెపై హత్యాయత్నానికి పాల్పడినట్లు నిందితుడు హేమంత్ నేరం అంగీకరించాడని పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ నాగరాజు, ఎస్సైలు కిరణకుమార్, కృష్ణాజీలను డీఎస్పీ అభినందించారు.

చేదు మిగిల్చిన మామిడి

- ధర లేక నిరాశలో రైతులు
- కోత ఖర్చులు కూడా రాని పరిస్థితి
- ఏటా నష్టాల్లో కూరుకుపోతున్నామని ఆవేదన



నూజివీడు : ఏ ఏటికాయేడు లాభాలను పంచుతుందేమోనని ఆశగా ఎదురుచూస్తున్న రైతుకు మామిడి చేదునే రుచిచూపిస్తోంది. ఈ ఏడాది మామిడి దిగుబడి తక్కువగా ఉండటం, ధర లేకపోవడంతో రైతులు కు ఆదాయం లేక నిరాశలో కొట్టుమిట్టాడుతున్నారు. పండ్లలో రారాజుగా మామిడికి పేరున్నప్పటికీ అదే మామిడిని సాగుచేస్తున్న రైతులు మాత్రం తీవ్రమైన నష్టాల ఊబిలో కూరుకుపోయారు. ఈ ఏడాదైనా పరిస్థితి బాగుంటుందనే ఆశాభావంతో మామిడి రైతు ముందుకు సాగుతున్నప్పటికీ పరిస్థితుల్లో మార్పు రాకపోగా ఏడాదికేడాదికి మరింత సంక్షోభంలో కూరుకుపోతున్నాడు. ఈ ఏడాది మామిడి దిగుబడి తక్కువగా ఉండటంతో మంచి ధర లభిస్తుందని రైతులు పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న మామిడి రైతులు తీవ్ర నిరాశ నిస్పృహలో కొట్టుమిట్టాడుతున్నారు. జిల్లాలో 40 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. దీనిలో నూజివీడు నియోజకవర్గంలోనే 35 వేల ఎకరాల్లో మామిడి పంట సాగులో ఉంది. బంగినపల్లి, తోతాపురి, చిన్నరసాలు, పెద్ద రసాలు వంటి రకాలు ఇక్కడ ఎక్కువగా ఉన్నాయి. మామిడి పంట లక్షణం ఒక ఏడాది కాపు బాగా ఉంటే మరో ఏడాది దిగుబడి ఉండదు. అయితే గత కొన్నేళ్లుగా ఈ సహజ లక్షణానికి భిన్నంగా మామిడి దిగుబడి ఉంటోంది. గత నాలుగైదేళ్లుగా ప్రతిఏటా కాపు తక్కువగానే ఉంటోంది. పూత సమయంలో ఎక్కడ చూసినా దట్టంగా కనిపిస్తున్నప్పటికీ పిందెగా మారే శాతం మాత్రం చాలా తక్కువగా ఉంటోంది. పూత దశలో ఆశిస్తున్న నల్లతామర రైతులను కోలుకోలేని దెబ్బ కొడుతోంది.

పతనమైన ధరలు

రైతులు ఎక్కుగా బంగినపల్లి, తోతాపురి(కలెక్టర్), రసాల తోటలను సాగుచేస్తుండగా ఈ ఏడాది అన్ని రకాల దిగుబడి చాలా తక్కువగా ఉంది. కాపు పది నుంచి 20శాతం లోపు మాత్రమే ఉండటంతో మామిడికి సీజన్ ప్రారంభంలో మంచి ధర లభించింది. బంగినపల్లి రకం కాయలకు టన్నుకు ముంబాయి మార్కెట్‌లో రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ధర లభించింది. అయితే రానురాను కొంతమేరకు ధర తగ్గుముఖం పట్టినప్పటికీ టన్ను రూ.25 వేల నుంచి రూ.30 వేల మధ్య ధర నిలబడింది. నూజివీడు, నున్న, విస్సన్నపేట తదితర ప్రాంతాల్లోని కమీషన్ షాపుల్లో టన్ను రూ.10 వేల నుంచి రూ.15 వేల లోపు మాత్రమే ఉంది. తోతాపురి పరిస్థితి కూడా అలాగే ఉంది. దీనికి ప్రారంభంలో టన్ను 12 వేల ధర లభించినప్పటికీ రానురాను పతనమవుతూ టన్ను రూ.3 వేలకు పడిపోయింది. అంతేగాకుండా మే నెల అంతా వర్షాలు కురవడం వల్ల కాయల్లో నాణ్యత సైతం తగ్గిపోయింది. దీంతో రైతులకు కోతఖర్చులు కూడా రాని పరిస్థితి నెలకొంది. నష్టాలు మిగలడంతో ఖరీఫ్ సీజన్‌లో మామిడి తోటల్లో దుక్కిదున్ని ఎరువులు వేసే పరిస్థితి లేదు.

పట్టించుకోని ప్రభుత్వం

మామిడి ధరలు పతనమైనా రైతులను ఆదుకునే ఆలోచన ప్రభుత్వం చేయలేదు. కనీసం ధరలు పతనమవ్వకుండా చర్యలు తీసుకోలేదు. నున్న మామిడి మార్కెట్‌లో మామిడి కాయలను కొనుగోలు చేసి దేశంలోని పలు ప్రాంతాలకు ఎగుమతి చేసే సేట్‌లతో సమావేశం ఏర్పాటు చేసి రైతులకు కనీస గిట్టుబాటు ధర ఇవ్వాలని చెప్పే అధికారి కూడా ఎవరూ లేకపోవడంతో మామిడి ధర పతనమై రైతులకు ఈ ఏడాది చేదును పంచింది.

రూ.15 లక్షల నష్టం వాటిల్లింది



ఈ ఏడాది ఎన్నడూ లేని విధంగా మామిడి ధరలు పతనమయ్యాయి. తోతాపురి టన్ను రూ.3 వేలకు పడిపోవడంతో కోత ఖర్చులు రాకపోవడంతో కాయలను కోయకుండా వదిలేశా. బంగినపల్లి ధర సైతం టన్ను రూ.10 వేలకు పడిపోయింది. 40 ఎకరాల్లో మామిడి కాపును కొంటే ధర లేక రూ.15 లక్షల నష్టం వాటిల్లింది. ఇంత దారుణమైన పరిస్థితిని గతంలో ఎన్నడూ చూడలేదు. ప్రభుత్వం మామిడి రైతులను, వ్యాపారులను ఆదుకోవాలి.

– బాణావతు రాజు, లైన్‌తండా, నూజివీడు మండలం

జగన్నాథ ఉత్సవాలకు సర్వం సిద్ధం



ఇత్తడితో తయారైన జగన్నాథుని దశావతారాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని జగన్నాథని ఆలయం రథయాత్ర ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. ప్రతి ఏటా పూరీలో వలె ఈ ఉత్సవాలు ఇక్కడ వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఈనెల 27 నుంచి వచ్చేనెల 6 వరకు నిర్వహించనున్న ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విశేషంగా అలంకరించారు. ఉత్సవాల తొలిరోజు సాయంత్రం 6 గంటల నుంచి జగన్నాథ రథయాత్ర ఆలయం నుంచి ద్వారకాతిరుమల క్షేత్రం వరకు జరుగనుంది. ఇదిలా ఉంటే ఈ సారి స్వామివారి దశావతారాలు ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి. దేవస్థానం అధికారులు లక్షలాది రూపాయలు వెచ్చించి ఇత్తడితో దశావతారాల రూపాలను తయారు చేయించారు. ఉత్సవాల ప్రారంభాన్ని పురస్కరించుకుని జగన్నాథుడు శుక్రవారం ఆలయ యాగశాలలో మత్స్యావతార అలంకారంలో దర్శనమిస్తారని, భక్తులు దర్శించి తరించాలని ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యన్నారాయణ మూర్తి కోరారు.

లారీ రూపంలో కబళించిన మృత్యువు

- మోటార్‌సైకిల్‌ను ఢీకొన్న లారీ
- భార్య మృతి, భర్తకు గాయాలు



ప్రమాదానికి కారణమైన టిప్పర్ లారీ



ఘటనా స్థలంలో సీతామహాలక్ష్మి మృతదేహం

భీమడోలు, మండవల్లి: మోటార్‌సైకిల్‌ను లారీ ఢీకొన్న ఘటనలో భార్య మృతి చెందగా భర్తకు గాయాలయ్యాయి. పూళ్ల పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాల ప్రకారం మండవల్లి మండలం కొవ్వాడ లంక గ్రామానికి చెందిన ఘంటసాల రామ్మష్ణ, సీతామహాలక్ష్మి పూళ్ల పంచాయతీ పరిధిలోని ఎంఎంపురం గ్రామంలో నివాసముంటున్నారు. కుమార్తె మోరు లక్ష్మీతిరుపతమ్మ అనారోగ్యం కారణంగా ఏలూరు ఆశ్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆస్పత్రిలో ఉన్న కుమార్తెకు భోజనం తీసుకువెళ్లేందుకు రామకృష్ణ, సీతామహాలక్ష్మి మోటార్‌సైకిల్‌పై ఏలూరుకు బయలుదేరారు. మార్గమధ్యమైన పూళ్ల పంచాయతీ వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న టిప్పర్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సీతామహాలక్ష్మి (61) అక్కడికక్కడే మృతి చెందింది. భర్త రామకృష్ణకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న భీమడోలు ఎస్సై వై.సుధాకర్ ఘటనా స్థలానికి చేరకుని పరిశీలించారు. రామకృష్ణ ఫిర్యాదు మేరకు ఎస్సై సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీతామహాలక్ష్మి మృతితో ఎంఎంపురం గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

యువకుడి బలవన్మరణం

నూజివీడు: పట్టణంలోని 17వ వార్డులో పిలగల రవీంద్ర (20) అనే యువకుడు గురువారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. బంధువులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కూలిపనులు చేసుకుంటూ జీవించే రవీంద్ర అదే ప్రాంతంలో ఒక వివాహిత గురించి తప్పుగా ప్రచారం చేస్తున్నాడంటూ ఎవరో చెప్పడంతో వివాహిత బంధువులు ఈనెల 24న రవీంద్రను కొట్టి క్షమాపణ చెప్పించారు. మరలా 25వ తేదీ న అదే వ్యక్తులు రవీంద్రను లాక్కెళ్లి ఇంట్లో కట్టేసి కొట్టారు. విషయం పోలీసులకు తెలిసి వారు వచ్చి అతడిని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఆ రోజు రాత్రి 10.30 గంటల సమయంలో పోలీసులు రవీంద్రను ఇంటి వద్ద వదిలి వెళ్లారు. గురువారం ఉదయం 10 గంటల సమయంలో తనకు టిఫిన్ తీసుకురమ్మని మేనమామ నెర్సు నాగేశ్వరరావుకు చెప్పగా అతను బయటకు వెళ్లడంతో రవీంద్ర ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అంతేగాకుండా మణికట్టు వద్ద చేతిని కోసుకున్నాడు. వివాహితకు సంబంధించిన వారు రెండు రోజుల పాటు తన మేనల్లుడిని ఇంట్లో కట్టేసి కొట్టడం, అనంతరం పోలీసులు కూడా కొట్టడంతో రవీంద్ర బలవన్మరణానికి పాల్పడ్డాడని నాగేశ్వరరావు వాపోయాడు. కాగా మృతుడిపై గతంలో ఐదు కేసులు నమోదై ఉన్నాయి. చాట్రాయి, విస్సన్నపేట స్టేషన్‌లలో ఒక్కొక్క కేసు, నూజివీడు టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మూడు కేసులు నమోదయ్యాయి.

కర్తవ్య నిర్వహణలో విగతజీవులై..

- రోడ్డు ప్రమాదంలో ఎస్సై, కానిస్టేబుల్ మృతి
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- గంజాయి రవాణా నిందితుడి అన్వేషణలో దుర్ఘటన
- నరసాపురంలో అంత్యక్రియలు



కోదాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎస్సై అశోక్ మృతదేహాన్ని బయటకు తీస్తున్న పోలీసులు



అశోక్ భౌతికకాయం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



మృతుడు ముద్దాల అశోక్ (ఫైల్)

ఆలమూరు : కర్తవ్య నిర్వహణలో ఉన్న పోలీసు సిబ్బంది రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందడం ఆ కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. మాదక ద్రవ్యాలు (గంజాయి) రవాణా చేస్తున్న నిందితుడిని పట్టుకోవడానికి వెళుతూ అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నియంత్రణ దినోత్సవం రోజునే ఆ ఇద్దరు అధికారులు అశువులు బాసారు. వివరాల్లోకి వెళితే.. ఆలమూరు మండల పరిధిలోని 216 ఏ జాతీయ రహదారిలో గతంలో గంజాయి అక్రమ రవాణా కేసు నమోదైంది. ఆ కేసులో నిందితుల్లో ఒకరు హైదరాబాద్‌లో ఉన్నాడన్న సమాచారంతో అతడ్ని పట్టుకునేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం రాత్రి ఆలమూరు ఎస్సై అశోక్, ఆత్రేయపురం కానిస్టేబుల్ ఎస్.బ్లెసన్ జీవన్, రావులపాలెం సీఐ కార్యాలయం ఐడీ పార్టీ హెడ్ కానిస్టేబుల్ దొంగ స్వామి, డ్రైవర్ జి.రమేష్ కారులో హైదరాబాద్ బయలు దేరారు. కోదాడ సమీపంలోని దుర్గాపురం వద్దకు వచ్చేసరికి వారు ఓ లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఎస్సై అశోక్ (45) కానిస్టేబుల్ బ్లెసన్ (32) అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. డ్రైవర్ రమేష్, హెడ్ కానిస్టేబుల్ స్వామికి తీవ్ర గాయాలయ్యాయి.

పదోన్నతి వస్తుందనుకునే లోపే..

అశోక్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన అనతి కాలంలోనే ఉన్నతాధికారుల సాయంతో అనేక కేసులను ఛేదించి పలు అవార్డులు, రివార్డులను సొంతం చేసుకున్నారు.ఈ ఏడాది సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి వస్తుందని కుటుంబ సభ్యులు భావిస్తున్న నేపథ్యంలో ఇంతటి ఘోరం జరగడం వారిని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. అశోక్ స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలోని రుస్తుంబాదా కాగా ప్రస్తుతం రాజమహేంద్రవరంలోని ఏవీ అప్పారావు రోడ్డులో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నారు. ఆయనకు భార్య శ్రీవల్లి, ఇద్దరు సోదరులు, ఒక సోదరి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బ్లెసన్ మృతిపై విలపించిన సోదరులు

విధి నిర్వహణలో ఎస్సై అశోక్‌కు తోడుగా వెళ్లి మృత్యు ఒడిలోకి వెళ్లిన కానిస్టేబుల్ బ్లెసన్ స్వస్థలం ఆలమూరు. ఆయన తన తల్లి హెప్సీబా, సోదరులు ప్రిన్స్ ఆదిత్య, అలెక్స్ కలసి ఉంటున్నారు. కష్టపడి చదివి ఉద్యోగం సాధించిన బ్లెసన్ తమ కుటుంబానికి అండగా ఉంటాడనుకుంటే హఠాత్తుగా మృతి చెందడంపై కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. వచ్చే ఏడాది కొత్త ఇల్లు నిర్మించుకుని పెళ్లి చేసుకుందామనుకుంటున్న తన సోదరుడు బ్లెసన్ ఆ ముచ్చట తీరకుండానే కానరాని లోకాలు వెళ్లిపోయాడని సోదరులు రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

నరసాపురంలో విషాదఛాయలు



పోలీసు వందనం చేస్తున్న దృశ్యం

నరసాపురం: ఆలమూరు ఎస్సై ముద్దాల అశోక్ మృతిపై నరసాపురంలో విషాదచాయలు అలుముకున్నాయి. ఆయన మృతేహాన్ని గురువారం సాయంత్రం స్వస్థలమైన నరసాపురం తీసుకొచ్చారు. కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, ఇతర పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు అశోక్‌కుమార్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం వశిష్ట గోదావరి గట్టున ఉన్న మహాప్రస్థానం శ్మశానవాటిక వద్ద పోలీసు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అశోక్ తండ్రి నర్సింహమూర్తి సాధారణ రైతు. తల్లి గృహిణి. వారు గతంలోనే మృతి చెందారు. అశోక్ వారంరోజుల క్రితం ఇంటికి వచ్చి స్నేహితులను, బంధువును కలిసివెళ్లినట్టుగా చెబుతున్నారు. ఇక్కడున్న రెండు రోజులుచాలా సరదాగా గడిపినట్టు గుర్తు చేసుకున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ 6 నెలల్లో any డిగ్రీ, PG, డిప్లొమా, B.tech, BAMS, BHMS, D. ఫార్మసీ, B. ఫార్మసీ, LLB, U.G.C యూనివర్సిటీస్ నుండి పూర్తిచేయండి. ✆ 99895 30727 [SCA25005386]

■ డైరెక్ట్10th, Inter, (వయస్సు18) Degree(All) PG(All) అడ్మిషన్ గైడెన్స్, డిప్లొమా, B.Tech, M.Tech, DBM ఫార్మసీ, M.Phill, Phd, BAMS, BHMS, BUMS. 8143100455, 8074482366 [G-233]

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2636]

Wanted

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP&డాక్టర్స్ కావలెను. జీ:15 వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.8317512135 [HA-15938]

■ ప్రముఖ కంపెనీ ఆఫీస్‌లో వర్క్ చేయుటకు అనుభవం గల స్త్రీ పురుషులు కావలెను. అర్హత: 10th – డిగ్రీ, జీతం: 15,000/– నుంచి Cont: 9908429239 [G-619]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 96032 03355, 92814 52843 [SCA25005423]

■ నిడదవోలు మండలం శంకరాపురంలో హృదయాలయం మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో మానసిక దివ్యాంగులకు సేవ చేయడానికి ఆశ్రమంలోనే ఉండి పనిచేయుటకు వార్డెన్లు జీతం -12వేలు, హెల్పర్లు -15వేలు, అర్హత (ఇంటర్) మగ/ఆడ మరియు డ్రైవర్ -18వేలు. కావలెను. సంప్రదించండి : 62817 04979, 94933 08199. [P-1020]

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మాణిక్యరావు



మాణిక్యరావును అభినందిస్తున్న యూనియన్ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఏలూరుకు చెందిన సీనియర్ జర్నలిస్ట్, ఎంటీవీ యూ ట్యూబ్ ఛానల్ చైర్మన్ కాగిత మాణిక్యరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం ఒంగోలులో నిర్వహించిన సంఘ 36వ రాష్ట్ర మహాసభల్లో ఈ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్యరావును ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ అధ్యక్షుడు కే.శ్రీనివాసరెడ్డి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కంచర్ల జయరాజు, ఐజేయూ జాతీయ కార్యదర్శి దూసనపూడి సోమ సుందర్, అభినందించారు. అలాగే మాణిక్యరావు ఎన్నికపట్ల ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు కేపీకే కిషోర్ శుభాకాంక్షలు తెలిపారు.

గూడ్స్ రైలు ఢీకొని వ్యక్తి మృతి

మండవల్లి: గూడ్స్ రైలు ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కైకలూరు-మండవల్లి రైల్వే స్టేషన్ల మధ్య 68–17 కిలో మీటరు నెంబర్ వద్ద ఒక వ్యక్తి అజాగ్రత్తగా రైల్వే ట్రాక్‌ను దాటుతుండగా కైకలూరు వైపు నుంచి వస్తున్న గూడ్స్ రైలు ఢీకొని ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మృతుడి వయస్సు 25 నుంచి 30 సంవత్సరాల మధ్య వయసు ఉంటుందన్నారు. మృతుడి వివరాలు తెలిస్తే గుడివాడ రైల్వే ఎస్సై ఫోన్ 94406 27570 లేదా 98662 21412 నంబర్లలో తెలియజేయాలని రైల్వే పోలీసులు కోరారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ఆకివీడు : యువతి అదృశ్యంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై హెచ్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం కలిదిండి మండలం కాళ్లపాలెంకు చెందిన యువతి (19) స్థానిక ఎస్ టర్నింగ్ ప్రాంతంలో నివసిస్తున్న తాత ఇంటి వద్దకు ఇటీవల వచ్చింది. ఈనెల 24వ తేదీ ఉదయం ఇంటి వద్ద నుంచి బయటకు వెళ్లిన యువతి తిరిగి రాలేదని, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించక పోవడంతో యువతి తాత పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సర్కారు నిర్ణయం.. డీలర్లకు భారం



భీమడోలులో వృద్ధునికి బయోమెట్రిక్ వేయిస్తున్న ఓ వృద్ధ మహిళా డీలర్

భీమడోలు: కూటమి సర్కారు నిర్ణయం రేషన్ డీలర్లకు భారంగా మారింది. ప్రభుత్వం ఎండీయూ వాహనాలను తొలగించి ఇంటింటికీ రేషన్ రద్దు చేయడంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. దీంతో ఒక అడుగు వెనక్కు వేసి 65 ఏళ్ల నిండిన వృద్ధులు, మహిళలు, దివ్యాంగుల ఇంటికే రేషన్ సరఫరా చేయాలని రేషన్ డీలర్లను ఆదేశించింది. జూలై నెల రేషన్‌ను ఈనెల 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ముందుగానే ఇంటింటికీ వెళ్లి డీలర్లు పంపిణీ చేయాలని పౌరసరఫరాల విభాగం అధికారులను ఆదేశించింది. అయితే క్షేత్రస్థాయిలో డీలర్ల ఇబ్బందులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోకపోవడంతో వారి పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.

డీలర్లకు కష్టాలు

రేషన్ డీలర్లలో ఎక్కువ మంది వృద్ధులు, మహిళలు, వితంతువులు, వికలాంగులుండడం.. కిలోమీటర్ల దూరంలో ఉన్న వృద్ధుల ఇంటింటికీ వెళ్లి రేషన్ సరఫరా చేయాల్సి రావడం వారికి తలకు మించిన భారంగా మారింది. వృద్ధుల ఇంటికి వెళ్లి రేషన్ పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందే గానీ బియ్యం, సరుకుల పంపిణీకి వాహనాన్ని కేటాయించలేదని, ఒక్క సంచి కూడా ఇవ్వలేదని, కమీషన్ సైతం పెంచలేదని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో 20 వేల రేషన్ కార్డులుండగా... 65 ఏళ్ల నిండిన వృద్ధుల రేషన్ కార్డులు 2406 ఉన్నాయి. వారందరికీ ఇళ్లకు వెళ్లి రేషన్ పంపిణీ చేయాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాపోతున్నారు. ప్రభుత్వం తమ సమస్యలను గుర్తించి రేషన్ పంపిణీకి మండలానికి కొన్ని వాహనాలు కేటాయించాలని, దూరాభారాన్ని ఎదుర్కొంటున్న డీలర్లకు పారితోషికాన్ని పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా భీమడోలు సీఎస్ డీటీ భరత్‌కుమార్ మాట్లాడుతూ వయోభారంతో ఉన్న డీలర్లు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

కనులపండువగా శివ కల్యాణం



కల్యాణ ఘడియలో స్వామి, అమ్మవార్లు

ద్వారకాతిరుమల : క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో శివ దేవుని కల్యాణ మహోత్సవం గురువారం కన్నులపండువగా జరిగింది. ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని అట్టహాసంగా నిర్వహించిన ఈ వేడుక భక్తులకు కనువిందు చేసింది. మండపంలో ఏర్పాటు చేసిన వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఉంచి, అర్చకులు విశేష పుష్పాలంకారాలు చేశారు. ఆ తరువాత కల్యాణ తంతును ప్రారంభించి, సుముహూర్త సమయంలో నూతన వధువరుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపజేశారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణలు, భక్తుల శివనామస్మరణల నడుమ మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకలను కనులపండువగా జరిపి, కల్యాణ మూర్తులకు హారతులిచ్చారు. ఈ వేడుకలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

క్లుప్తంగా

నెలాఖరులోపు కౌలు కార్డులు పొందాలి

పెంటపాడు: కౌలు రైతులందరూ నెలాఖరు లోపు పంట సాగుదారు హక్కు పత్రం (సీసీఆ ర్సీ) తీసుకోవాలని తహసీల్దార్ తలారి రాజ రాజేశ్వరి తెలిపారు. గురువారం రాచర్ల గ్రామంలో మండల వ్యవసాయాధికారి చీర్ల రవికుమార్ ఆధ్వర్యంలో రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం కేవలం పొలం సాగు చేసుకొనేందుకు కౌలు రైతులను పోత్సహిస్తోం దన్నారు. దీనివల్ల సొంత రైతులకు ఇబ్బంది ఉండబోదన్నారు. ఏవో రవికుమార్ మాట్లా డుతూ వర్షాకాలం ప్రారంభమైన దృష్ట్యా రైతులు త్వరితగతిన నారుమడులు వేసుకోవా లన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉంచామన్నారు.

ఆధ్యాత్మిక జీవనం అలవరుచుకోవాలి

పెంటపాడు: విశ్వాసులు దేవుని ఆధ్యాత్మిక జీవనం అలవరుచుకోవాలని ఇమ్మానియేలు ప్రేయర్‌ఫెలోషిప్ (ఈపీఎఫ్) అధ్యక్షుడు పరస మోజెస్‌ప్రవీణ్ పేర్కొన్నారు. తణుకు పైడి పర్రు ఈపీఎఫ్ చర్చిలో మూడు రోజులపాటు జరగబోయే నెలాఖరు ఉపవాస ప్రార్థనలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సంద ర్భంగా ఆయన ప్రారంభ ఉపన్యాసం చేశారు. మానవ అవసరతలు, ధనం, ఇహలోక సుఖాలను పక్కన పెట్టి దేవుని ఉపవాస ఆధ్యా త్మిక జీవనాన్ని అలవరచుకొనే శక్తిని ప్రతి విశ్వాసి పొందాలన్నారు. దైవసేవకురాలు పి. అరుణకుమారి, ప్రైజీ, చర్చిసంఘ విశ్వాసులు పాల్గొన్నారు. మూడు రోజులపాటు జరగ బోయే ఈ ఉపవాస ప్రార్థనలలో భక్తులు పాల్గొ నాలని ప్రవీణ్ ఈ సందర్భంగా కోరారు.

కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి

తణుకు అర్బన్: మునిసిపల్ ఇంజనీరింగ్ అవుట్‌సో ర్సింగ్ కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని జేఏసీ నాయకులు గెల్లా విజయ్‌కుమార్, ఉండ్రాజవరపు శ్రీను కోరారు. తణుకు మునిసిపల్ కార్యాలయం ముందు నిర్వహి స్తున్న నిరాహారదీక్ష శిబిరంలో వారు మాట్లాడారు. 20 ఏళ్లకుపైగా సర్వీసు ఉన్నా రూ. 13వేలు వేతనంతో సరి పెట్టుకునే పరిస్థితి కార్మికుల్లో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలతో చాలీచాలని వేతనాలతో అప్పులు చేసి ఇళ్లు నెట్టుకొస్తున్నామని ప్రభుత్వం కనిక రించి న్యాయమైన కోర్కెలు తీర్చాలన్నారు. ఉదయం విధుల్లోకి వచ్చినప్పటి నుంచి సమయం చూసుకోకుం డా పనిచేసే పరిస్థితి అవుట్‌సోర్సింగ్ కార్మికుల్లో ఉం దని, తప్పనిసరి పరిస్థితుల్లోనే సమ్మెబాట పట్టామని అన్నారు. ఈ సందర్భంగా అవుట్‌సోర్సింగ్ విభాగం లోని వాటర్ వర్క్స్, ఎలక్ట్రికల్, కంప్యూటర్ డేతా అప రేటర్లు, పార్కు మజ్దూర్లు, సెక్యూరిటీ విభాగాలకు చెం దిన కార్మికులు గురువారం శిబిరంలో చొక్కాలు విప్పి అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పడాల దానం, పిండి పెద్దిరాజు, ప్రసాద్, సత్యనారా యణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



తణుకులో నిరాహారదీక్ష శిబిరంలో అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న కార్మికులు

కొనసాగుతున్న ఇంజనీరింగ్ కార్మికులు నిరసనలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ ఇంజనీరింగ్ కారి ్మకుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరి ష్కరించాలని జేఏసీ నాయకులు మద్రిపూడి సతీష్ కుమార్, అవిడి కుమార్, ఎర్రంశెట్టి నాగే శ్వరరావు, బండారు శ్రీను, అడ్డాల చలపతి, ప్రత్తి రమేష్‌లు విజ్ఞప్తి చేశారు. సమ్మెలో భాగంగా జేఏసీ పిలుపు మేరకు పట్టణంలో గురువారం నాల్గోవ రోజు సమ్మె జరిగింది. రిలే దీక్ష శిబిరం లో అర్ధనగ్న నిరసన ప్రదర్శన నిర్వహించారు. పెద్దిబోయిన కిషోర్ కుమార్, పసుపులేటి సూర్య ప్రకాష్, ఈరెల్లి ధనరావు, నున్న శ్రీనివాసరావు, బొడ్డు సూర్యకుమారి, దాసరి పుష్పకుమారి, కూరాకుల ప్రభావతి, కోటిపల్లి రాజేష్, ఆర్ఎ స్ఎస్ మూర్తి, బాడీలంక శేషగిరి, ఈరెల్లి రాజులు పూలమాలలు వేసుకొని దీక్షలలో పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

తణుకు అర్బన్: తణుకు నియోజకవర్గంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ లైన్స్ మర మ్మతులు, నిర్వహణలో భాగంగా శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ శాఖ డివిజినల్ ఇంజనీర్ కె.నరసింహమూర్తి తెలి పారు. తణుకు పట్టణ పరిధిలోని మునిసిపల్ కార్యా లయం, కొమ్మాయిచెర్వు, పాతవూరు, ఇరగవరం కాలనీ, ఉమెన్స్ కాలేజీ, డిమార్ట్, కొండాలమ్మ పుంత, ఎన్టీఆర్ పార్కు ప్రాంతాలతోపాటు రూరల్ పరి ధిలోని దువ్వ, తేతలి, సత్యవాడ, రెడ్డిచెర్వు, సూర్యారావుపాలెం, ఇండస్ట్రియల్ సర్వీస్‌లు, అత్తిలి మండలంలోని అత్తిలి, పాలి, ఆరవల్లి, మంచిలి, ఈడూరు, సీహెచ్ చెరువు, ఈడూరు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, విని యోగదారులు సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు ఇవే

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని 33/11 కేవీ హౌసింగ్‌బోర్డు పరిధిలో గణేష్ నగర్ ఫీడర్, పాతూరు సెమి ఇండోర్ సబ్ స్టేషన్ పరిధిలో మహా లక్ష్మినగర్ ఫీడర్, జెడ్పీ ఫీడర్‌లకు సంబంధించి విద్యుత్ లైన్‌లు మరమ్మతుల నిమిత్తం ఈ నెల 27వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యా హ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తు న్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహామూర్తి తెలిపారు. గాంధీ బొమ్మ సెంటర్, గణేష్ నగర్, మామిడితోట, గవర్నమెంట్ పాలిటెక్నిక్, ఏరియా ఆసుపత్రి, గుణ్ణం ఫంక్షన్ హాల్, మహాలక్ష్మీనగర్, సత్యవతినగర్, పీఅండ్‌టీ కాలనీ, టీటీడీ కల్యాణ మండపం ఏరియాలోని పంపు హౌస్, మెయిన్‌రోడ్డు, మసీదు రోడ్డు ఏరియా ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు సొత్ పరిధిలో విద్యుత్ నిలుపుదల

టూ టౌన్‌లోని సొత్ 33/11కేవీ ఎస్ఎస్ సబ్ స్టేష న్‌కు సంబంధించి పడాల, కొబ్బరితోట, జట్లపాలెం, యాగర్లపల్లి ఫీడర్లు పరిధిలో పట్టణంలోని యాగ ర్లపల్లి నుంచి కె.పెంటపాడు వరకు పోల్ స్ట్రక్చర్ పనులు నిమిత్తం ఈ నెల 27వ తేదీ శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి 2.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ తాడేప ల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి వెల్లడిం చారు. పడాల, భాగ్యలక్ష్మిపేట, యాగర్లపల్లి, కొబ్బ రితోట, ఏలూరు రోడ్డు, రామచంద్రరావుపేట, మోడ్రన్ కేఫ్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివే స్తున్నందున వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలను, నీలాద్రిపురం విద్యుత్ సబ్‌స్టేషన్ మర మ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలు పుదల చేయనున్నట్టు విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజ నీర్ కే.నరసింహమూర్తి తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

మాదకద్రవ్యాలపై యువత అవగాహన కలిగి ఉండాలి

తణుకు అర్బన్: ప్యాషన్‌గా మొదలుపెట్టే మాదక ద్రవ్యాల వినియోగం వాటికి బానిసలుగా మారి యువత భవితను చిదిమేస్తుందని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ సత్తి మణికంఠరెడ్డి అన్నారు. మాదకద్రవాల దుర్వినియోగ నివారణపై సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వ హించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మాదకద్రవ్యాల వినియోగించిన అనంతరం ఆ మత్తులో ఏం చేస్తున్నారో తెలియక నేరాలకు పాల్పడుతుండడం బాధాకరమన్నారు. యువత మాదక ద్రవ్యాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఏడుకొండలు, మానసిక వైద్య నిపుణులు డాక్టర్ బి.రమేష్‌కుమార్‌లు యువతకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ కోశాధికారి అర్జి భాస్కరరావు, సభ్యులు ఆకెళ్ల సుబ్రహ్మణ్యం, ఎ.ప్రసాదరావు, ఎ.సుబ్బారావు, పాతూరి శివన్నా రాయణ, తాజుద్దీన్, విద్యార్థులు పాల్గొన్నారు.



తణుకులో సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ సీఐ మణికంఠరెడ్డి

ఉచితంగా నట్టల నివారణ మందు పంపిణీ

అత్తిలి: అంతర పరాన్న జీవాల నుంచి జీవాలను కాపాడి తద్వార జీవాల పెంపకందారులు ఆర్థికాభి వృద్ధి సాధించడానికి జీవాలన్నింటికి ఉచితంగా నట్టల నిర్మూలన మందులను వేస్తున్నామని మం డల పశువైద్యాధికారి డాక్టర్ కె శంకరభావన్నారా యణ చెప్పారు. పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గురువారం నుంచి గొర్రెలు, మేకలలో ఉచిత నట్టల నివారణ మందులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈసందర్భంగా శంకర భావన్నారా యణ మాట్లాడుతూ చిన్న జీవాల పెంపకం లాభ దాయకంగా ఉండాలంటే పరాన్న జీవుల నుంచి జీవాలను రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అంతర పరాన్నజీవులు శరీరం, కాలే యం, ఊపిరితిత్తులు, జీర్ణాశయం, మెదడు తది తర అంతర్గత అవయువాల్లో స్థావరం ఏర్పరచు కుంటాయని, ఇవి జీవాల్లో పోషక పదార్థాలను, రక్తాన్ని స్వీకరించి జీవాలను రక్తహీనతకు గురిచే స్తాయని అన్నారు. గొర్రెలు, మేకలు ఆహారపు అల వాట్లు దృష్ట్యా మేకలలో కంటె గొర్రెలలో పరాన్న జీవుల సమస్య ఎక్కువగా ఉంటుందని తెలిపారు. పశు సంవర్ధకశాఖ ద్వారా ప్రతి ఏడాది నాలుగు పర్యాయాలు జీవాలన్నింటికి ఉచితంగా అంతర పరాన్న జీవుల నిర్మూలన మందులను తాగించడం జరుగుతోందని అన్నారు. గొర్రెలు, మేకలు పెం పకందారులు ప్రయోజనం కోసం ప్రభుత్వం గ్రామాల్లోని జీవాలన్నింటికి పశువైద్యశాలల్లో సామూహికంగా నట్టల నివారణ మందును త్రాగించడం జరుగుతుందని, ఈఅవకాశాన్ని పెం పకందారులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ శంకరభావన్నారాయణ కోరారు.



అత్తిలి ప్రాంతీయ పశువైద్యశాలలో మేకలకు నట్టల నివారణ మందును వేస్తున్న దృశ్యం

సమాజ సేవ కోసం మాజీ సైనికోద్యోగులు రావచ్చు

తణుకు అర్బన్: తణుకు కోర్టు ఆవరణలో ఉన్న మండల న్యాయ సేవల కమి టీలో స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు, సమాజసేవ చేయాలనే ఆసక్తి ఉన్న మాజీ సైనిక ఉద్యోగుల నుంచి బయోడేటాతో పాటు మాకు ఇష్టమే అనే అభిప్రాయాన్ని కోరుతున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌ప ర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి తెలిపారు. తణుకు కోర్టు పరి ధిలోని 7 మండలాలకు చెందిన వారు అర్హులని, తణుకు కోర్టు ఆవరణలో పనిచేయుచున్న మండల న్యాయ సేవల కమిటీ, ప్యానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లుగా పనిచేయుటకు ఆసక్తి కలిగిఉన్న వారు తమ అం గీకారాన్ని బయోడేటా, మొబైల్ నంబరు 9704127956, ల్యాండ్ నంబరు 08819 241133లో సంప్రదించాలని కోరారు. అంతేకాకుండా చైర్మన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి, 4వ అదనపు జిల్లా కోర్టు పేరుతో పోస్ట్ ద్వారా కూడా బయోడేటా పంపించవచ్చని సూచించారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 29లోపు బయోడేటాను పంపించాలని వివరించారు.

మత్తుతో జీవితం నాశనం

తాడేపల్లిగూడెం (టీఓసీ): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరుతూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక జీవీమాల్ నుంచి పోలీస్ ఐలాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జరిగిన ర్యాలీకి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, డీఎస్పీ విశ్వనాథ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గంజాయి జీవితాలను నాశనం చేస్తుందని గంజాయిను మూలలతో సహా రూపుమాపాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ ఆది ప్రసాద్, రూరల్ సీఐ రమేష్, మునిసిపల్ కమీష నర్ యేసుబాబు, తహసిల్దార్ సునీల్, తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులకు కూలిన చెట్టు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వర్షాలు, ఈదురు గాలలు కారణంగా స్థానిక కె.ఎన్.రోడ్డు ఆర్టీఓ కార్యాలయం సమీపంలో చెట్టు కూలింది. మునిసిపల్ అధికారులు స్పందించి జేసీబీ సహాయంతో ఉదయం చెట్టును తొలగిం చారు. మెయిన్ రోడ్డులో వాహన రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

తణుకు సబ్‌జైలును సందర్శించిన న్యాయమూర్తి

తణుకు అర్బన్: మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి గురువారం తణుకు సబ్ జైలును సందర్శించారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న రిమాండ్ ముద్దాయిలకు అందుతున్న వసతులను జైలు సూపరింటెండెంట్ ఎ.మోహన్‌రావును అడిగి తెలుసుకున్నారు. న్యాయ వాదులను పెట్టుకునే స్థోమతలేని ముద్దాయిలకు మండల న్యాయ సేవల కమిటీ ద్వారా ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎవరైనా కేసులు ఒప్పుకుంటే వాటిని జైలు అదాలత్‌లో పరిష్కరిస్తామని, వచ్చేనెల 5వ తేదీన తణుకు కోర్టులో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేసు కోవచ్చని సూచించారు. రిమాండ్ ముద్దాయిలు బయటకు వెళ్లిన తరువాత సమాజంలో మంచి ప్రవర్తనతో మెలగాలని, కష్టపడి పనిచేసే తత్వాన్ని అలవాటు చేసుకుని జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

వనరులను వినియోగించుకోలేకపోవడం ప్రభుత్వ చేతగానితనమే

తణుకు అర్బన్: ఆంధ్రప్రదేశ్‌లో అందుబాటులో ఉన్న వనరులను వినియో గించుకోలేకపోవడం రాష్ట్ర ప్రభుత్వ చేతగానితనమేనని తెలుగు శక్తి అధ్య క్షుడు బీవీ రామ్ అన్నారు. తణుకులో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో గడిచిన ఏడాది కాలం లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహికులు రాకపోవడం బాధాకరమని చెప్పారు. అధికార యంత్రాంగం ఈ ఏడాది పాటు ప్రగతికి దోహదపడకుండా కాలయాపన చేస్తోందని విమ ర్శించారు. శుక్రవారం ఎంఎస్ఎంఈ దినోత్సవమని ఈ ఏడాది కాలంలో ఏ జిల్లాలో ఎన్ని పరిశ్రమలు వచ్చాయనే విషయాన్ని ప్రిన్సిపల్ సెక్రటరీ యువ రాజ్ చెప్పగలరా అని నిలదీశారు.

ఇరగవరంలో రెవెన్యూ అధికారుల తనిఖీలు

ఇరగవరం: ఇరగవరం మండలం రేలంగి గ్రామంలో డొమెస్టిక్ గ్యాస్ సిలిం డర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని సివిల్ సప్లై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కేవీవీ సత్యనారాయణ తెలిపారు. ఇరగవరం గ్రామంలో గురువారం గ్రామంలో రాజుల రామాలయం వద్ద పిండిమర నిర్వహిస్తున్న అడ్డా ప్రభాకర్ డొమెస్టిక్ సిలిండర్లను వాణిజ్య అవ సరాలకు వినియోగించడంపై ఆయనపై 6ఏ కేసు నమోదు చేశామన్నారు. 8 గ్యాస్ సిలిండర్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో వీఆర్వో పసుపులేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

భవిష్యత్తు అవసరాల కోసం మాస్టర్ ప్లాన్

తణుకు అర్బన్: భవిష్యత్తు తరాల అవసరాలకు ఉపయోగపడే విధంగా మాస్టర్ ప్లాన్ రూపొందించాల్సిన అవసరం ఉందని ఇందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. తణుకు పురపాలక సంఘానికి సంబంధించి మాస్టర్ ప్లాన్ తయారీలో భాగంగా గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే మాట్లాడారు. తణుకు పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందేలా మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. మునిసిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో వివిధ శాఖ లకు చెందిన అధికార్లు తదితరులు పాల్గొన్నారు.